

జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న రైతులు

'ఏజెన్సీ ఎస్సీ రైతులకు పహనీలు ఇవ్వాలి'

నార్నూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గిరిజన ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీ రైతులు సాగు చేస్తున్న భూములకు పహనీలు ఇవ్వాలని సోమవారం జిల్లాకేంద్రంలో కలెకర్ రాజర్షి షాను కలిసిన ఏజెన్సీ భూసాధన సమితి సంఘం సభ్యులు కలిసి విన్నవించారు. అధ్యక్షుడు గేడం నిరంజన్ మాట్లాడుతూ 1970 కంటే ముందు నుంచి సాగు భూములు చేయు వారికి ప్రభుత్వం ఆదుకునేలా సహకారం అందించాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, రైతులకు పహనీలు ఇచ్చి బ్యాంక్ ద్వారా ఋణ సదుపాయం కల్పించాలని కోరారు. సంబంధిత అంశాలపై ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించి పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వారి వెంట నాయకులు సంతోష్ మానే, బాపు రావు, సంబయ, విఠల్ ఉన్నారు.



'స్థానిక' ఎన్నికలపై.. నజర్!

- ప్రభుత్వ ప్రకటనతో మళ్లీ మొదలైన ఎన్నికల ప్రచారం
- అప్రమత్తమవుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు
- మండలాల వారీగా స్థానిక నేతలతో సమీక్షలు షురూ..
- తాజా మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలపై తీవ్రమైన వ్యతిరేకత
- గెలుపు ధీమాతో కనిపిస్తున్న ఆశావహ నేతలు
- జిల్లాలో మొత్తం 166 ఎంపీటీసీ స్థానాలు కాగా.. 20 జడ్పీటీసీ స్థానాలు

ఆదిలాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనతో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రధాన పార్టీలు ప్రత్యేకదృష్టిని సారిస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన లోకల్‌బాడీ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తుంది. గత రెండేళ్ల క్రితమే స్థానిక సంస్థల పదవీ కాలం ముగిసి పోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తుంది. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు ప్రజల దరికి చేరడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ నెల ఆఖరు వరకు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవు తున్నట్లు వార్తలు వస్తున్నాయి. జిల్లాలో 473 గ్రామ పంచాయతీలతో పాటు 166 ఎంపీటీసీ స్థానాలు 20 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఇక ప్రభుత్వం ముహూర్తం ఫిక్స్ చేస్తే.. నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి.





రిజర్వేషన్లపై ఉత్కంఠ

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న ఆశావహ నేతల్లో ప్రధానంగా రిజర్వేషన్ల పైననే తీవ్రమైన ఉత్కంఠ కనిపిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు ఒకే రిజర్వేషన్ ఉంటుందన్న నిబంధన తీసుకొచ్చారు. దీనిపై కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టతను ఇవ్వడం లేదు. దీంతో ఆశావహ నేతల్లో అయోమయం కనిపిస్తుంది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నా.. ఈసారి రిజర్వేషన్ కలిసి వస్తుందో? రాదో?నన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వేషన్లు ఖరారైతేనే పోటీపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని పలువురు నేతలు పేర్కొంటున్నారు. అయితే గతంలో ఉన్న రిజర్వేషన్లనే యదావిధిగా కొనసాగిస్తారా? లేక ఏమైనా మార్పులు చేర్పులు చేస్తారా? అనేది దానిపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తుంది. కొన్ని గ్రామాల్లోనైతే రిజర్వేషన్ కలిసి వస్తే చాలు గెలుపు ఖాయమైనట్లేనన్న ధీమా కనిపిస్తుంది.

గెలిచి తీరాల్సిందే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసారి ఎలాగైనా గెలిచి తీరాల్సిందేనని పార్టీ శ్రేణులకు నేతలు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే నియోజక వర్గాలు, మండలాల వారీగా ముఖ్య నేతలతో సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మేజర్ గ్రామ పంచాయతీలు, మండలాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన సోనాల, బోరజ్, సాత్నాల మండలాలపై ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ సరైన నాయకత్వం కోసం పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. బలమైన సామాజిక వర్గాలకు చెందిన నేతలను బరిలోకి దింపేందుకు సిద్ధమవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి పెద్ద సవాలుగా మారగా.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టాయి. జిల్లాలో మూడు ప్రధాన పార్టీలు పోటాపోటీగానే కనిపిస్తున్నాయి. ఈ సారి ఏ పార్టీకి వన్ సైడ్ ఫలితాలు వచ్చే అవకాశం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అవినీతి ఆరోపణలు

చాలా మంది తాజా మాజీ స్థానిక ప్రజాప్రతినిధులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి ఆరోపణలు ఉన్న నేతలు ఈ సారి ఎన్నికల్లో పోటీ చేస్తే ఓటమి ఖాయమంటున్నారు. ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో 80 శాతం తాజా మాజీ కౌన్సిలర్‌లపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడ్డారన్న విమర్శలు ఉన్నాయి. ఈసారి తాజా మాజీలకు టికెట్లు ఇస్తే ఓడిపోయే ప్రమాదం ఉందంటున్నారు. అలాగే చాలా గ్రామాలలో సర్పంచులు అవినీతికి

(తరువాయి 6వ పేజీలో...)





మాట్లాడుతున్న వైద్యాధికారి సద్దాం

ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీవో

నేరడిగొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. సోమవారం మండలంలోని సావర్గం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా పరిసరాల వ్యక్తిగత శుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంతేగాకుండా రోడ్డు సౌకర్యం లేని ఆయా గ్రామాల్లో గర్భిణులను ముందస్తుగా ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందిం చాలన్నారు. సమావేశంలో ఎంపీవో లక్ష్మణ్, ఉపాధ్యాయుడు ప్రకాష్, పీహెచ్‌సీ వైద్యుడు సద్దాం, హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్ వైజర్ స్వర్ణలత, పంచాయతీ సెక్రటరీ శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ నిఖిత్, ఏఎన్ ఎం జ్యోతి, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ప్రాణం పోసిన వర్షం

బోథ్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గత వారం రోజుల నుంచి రైతులు వర్షం కోసం ఎదురుచూస్తుండగా.. సోమవారం నాలుగు గంటల ప్రాంతంలో వర్షం కురిసింది. దీంతో పంటలకు ప్రాణం పోసినట్లు అయ్యిందని రైతులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. ఏది ఏమైనా 20 నిమిషాల పాటు కురిసిన వర్షం పంటలకు ఆసరాగా నిలిచిందని రైతులు పేర్కొంటున్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానాన్ని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన జన్మదిన సందర్భంగా కుటుంబంతో కలిసి తిరుమల తిరుపతి దేవస్థానాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఏటా నేరడిగొండలో గల తన నివాసంలో కార్యకర్తలు, నియోజకవర్గ నాయకుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోగా.. సోమవారం తిరుమలలో కుటుంబ సభ్యులతో కలిసి పుట్టిన రోజు జరుపుకోవడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. ప్రతీ కార్యకర్త ఆశీస్సులు తనపై ఉండాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తామన్నారు.



తిరుమలలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే అనిల్

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అర్జీలను సత్వరమే పరిష్కరించేలా అధికారుల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తూ వినతులు అందించగా వాటిని క్షుణంగా పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చే అర్జీల పై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పెండింగ్‌లో అర్జీలు లేకుండా చూడాలని సూచించారు. సీఎం ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు వచ్చే వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తమ పేర్లు రాలేదంటూ ప్రజా ఫిర్యాదుల విభాగానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ విషయమై ఆదిలాబాద్‌కు చెందిన దుర్గానగర్, ఖానాపూర్, అంబేద్కర్ కాలనీలకు చెందిన లబ్ధిదారులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే, మురికి కాలువలు లేకపోవడంతో ఇళ్లలోకి వర్షపు నీరు వస్తుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లాండసాంగ్వి వాసులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే, మున్సిపల్ కార్మికులకు కనీస సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్ కలెక్టర్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

- సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి : పీవో

ఉట్నూర్: గిరిజనప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల సమస్యల అర్జీలను స్వీకరించారు. కాగా, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ (పీవీటీజీ) మేస్రం మనోహర్, డీడీ అంబాజి, డీఎంజీసీసీ (పీహెచ్ఓ) సందీప్‌కుమార్, ఏడీఎం అండ్‌హెచ్ఓ కుడిమెత మనోహర్, ఏఓ దామోదర స్వామి,మనోహర్, మేనేజర్ శ్యామల, డీపీఓ ప్రవీణ్,జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రాలను అందజేస్తున్న అర్జీదారులు



సుంకిడిలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా



పిప్పల్‌కోటిలో 'రైతు నేస్తం' వీక్షిస్తున్న అధికారులు, రైతులు

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

- రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా

తలమడుగు, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : రైతు నేస్తం.. రైతుబంధు.. వంటి పథకాలతో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం మండలంలోని సుంకిడి రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి ముఖ్యమంత్రి, క్యాబినెట్ మంత్రి వర్గం, అందరూ కూడా హైదరాబాద్ నుంచి రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో కూడా ఇక్కడ రైతు వేదిక సుంకిడి నుంచి ఈ కార్యక్రమానికి హాజరు కావడం జరిగిందని, ఇది చాలా మంచి కార్యక్రమని, ఇప్పటివరకు ప్రతీ మండలంలో రైతు వేదికలు ప్రారంభించడం జరిగింది. రైతు వేదిక ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ నుంచి సైంటిస్టులు రైతులు రైతువేదికలలో సేంద్రియ పద్ధతులు పంటను సాగు చేయడం ఎరువులు, పంట మార్పిడి, తదితర వాటిపై సలహాలు, సూచనలు రైతులకు అందిస్తున్నారని అన్నారు. అలాగే, రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లో సంభాషణ ద్వారా రైతులు తమ ఉత్పాదకతను మెరుగు పర్చుకోవడానికి వ్యవసాయ రంగంలో ఉత్తమ పద్ధతులను నేర్చుకోవడానికి దోహద పడుతుందని అన్నారు. అంతేగాకుండా రైతులు వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపాటు సంభవిస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇందులో మాజీ జడ్పీటీసీ గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కల్యాణలక్ష్మి రాజేశ్వర్, సీఈఓ పిఎసిఎస్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ ప్రమోద్ రెడ్డి, ప్రత్యేక అధికారి గజానన్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతు వేదికలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికల్లో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని, ధన్నోరా రైతు వేదికల్లో మండల ప్రత్యేక అధికారి కిషన్, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి సోమవారం రైతు యువ నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. నాయకులు దాసరి రమేష్, జలిగిరి మల్లేష్, ఆకిటి అశోక్‌రెడ్డి, రెండ్ల గోవర్ధన్, తోనుపు స్వామి, ఏతవోలు శంకర్, సంగీత రైతులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని పాట్నాపూర్ గ్రామ రైతు వేదికలో నూతనంగా మంజూరైన వీడియో కాన్ఫరెన్స్ థియేటర్‌ను సోమవారం ప్రారంభించారు. గ్రామస్థులు స్థానిక నాయకులు అధికారులు పెద్దసంఖ్యలోహాజరు కావడం జరిగింది.

నార్నూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికల ద్వారా ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమానికి మండలమలోని నార్నూర్, మన్కపూర్, బింపూర్, కొత్తపల్లి, ఉమ్రి, మాలేపూర్ తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్య లో హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఆకాష్ మాట్లాడారు.

సిరికొండ: మండలంలోని పలు రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి రైతులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిరికొండ, లచ్చింపూర్ బి, పోచంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల సమస్యలపై మాట్లాడారు.

నేరడిగొండ: రైతు నేస్తం కార్యక్రమం సోమవారం మండల కేంద్రంతో పాటు బుగ్గరాం గ్రామంలో గల రైతువేదికలో నిర్వహించగా.. వీడియో కాన్ఫరెన్స్‌లో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, రైతులు పాల్గొన్నారు.

ఊరు పేరు మారింది..

- జిల్లాలో రెండు గ్రామాల పేర్లు మార్పుపై గెజిట్ విడుదల

ఆదిలాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామాల పేర్లను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసింది. దీంతో బోథ్ మండలంలోని లంబాడితండా గ్రామం ఇకపై బాబెరతండాగా కొనసాగనుంది. అలాగే, ఉట్నూర్ మండలంలోని జమాల్‌తండా గ్రామాన్నికొత్తగా సాకెర(జే) గ్రామంగా మార్చారు. అలాగే ఇన్నాళ్లు సిరికొండ మండలంలో కొనసాగిన మల్లాపూర్ గ్రామాన్ని ఇంద్రవెల్లి మండలంలో కలుపుతూ ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసింది.

సైనిక్ పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

బోథ్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో వివిధ పాఠశాలల నుంచి సైనిక్ పాఠశాలలో చేరేందుకు గాను విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభం చేయడం జరిగిందని మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. ఈనెల 19 వరకు ఎంపిక ప్రక్రియ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాకు చెందిన బాలబాలికలు నాలుగవ తరగతి ప్రవేశం కోసం 8-9 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. శారీరకంగా ఆరోగ్యపరంగా పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందని, పూర్తి వివరాల కోసం 9052332467 ద్వారా సంప్రదించాలని సూచించారు.

పీజీటీ ఫిజిక్స్ పోస్టుకు దరఖాస్తులు

గుడిహత్నూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని స్థానిక మోడల్ స్కూల్‌లో పిజీటీ ఫిజిక్స్ అవర్లీ బెస్ట్ టీచింగ్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆరే శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ ఫిజిక్స్ ఎంఎస్సీ బీఎడ్ చేసిన అర్హత గల అభ్యర్థులు ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

- మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి..

ఆదిలాబాద్ అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.జె.అరుణకుమారి ఒక ప్రకటనలో తెలి పారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు బీఎస్సీ, ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంజడ్‌సీ, బీకాం(సీఏ), బీకాం(జనరల్),బీఏ కోర్సులలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్సీ విద్యార్థినులు ఈ నెల 23 వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన విద్యార్థినులు పదవ తరగతి, ఇంటర్ మెమోలు, టీసీ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఫొటోలు, దోస్తు రిజిస్ట్రేషన్ ఐడీ, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8790009838 నెంబర్‌ను సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

నేరడిగొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేజాపూర్ గ్రామంలో గల ఎంపీపీఎస్ పాఠశాలలో సోమవారం ఘనంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో భూమారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారులకు ఆశీర్వదించారు. సరస్వతి దేవి పూజ నిర్వహించి చిన్నారులకు తొలి అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. కొత్తగా చేరిన విద్యార్థులకు పుస్తకాలు మరియు యూనిఫార్మ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదవాలనే ప్రోత్సాహం కలిగించే దిశగా మనందరం కృషి చేయాలన్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు సంతోష్ కుమార్, కాంప్లెక్స్ హెచ్.ఎమ్ మణిలత, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువ నాయకుడు కపిల్ యాదవ్

ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా రక్తదానం

భీంపూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదినం సందర్భంగా సోమవారం తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రిమ్స్ ఆడిటోరియంలో భీంపూర్, తలమడుగు, తాంసి మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. రక్తదాతలకు ఎమ్మెల్యే సోదరుడు ధన్‌రాజ్ పండ్లను పంపిణీ చేశారు. కాగా బీఆర్ఎస్ నాయకులు భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేసి కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, కన్వీనర్ మేకల నాగయ్య, బోథ్ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మోతె కిరణ్, నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, అభిరామ్‌రెడ్డి, బక్కి కపిల్, మల్లెల స్వామి, బతుల ఆడేళ్ల మడావి వినోద్, మడావి లింబాజి, ముకుందా సంతోష్, రవీందర్ జాదవ్, మేకల ప్రవీణ్, ఇర్ఫాన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జన్మదిన వేడుకలను నియోజకవర్గంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని బాబర గ్రామంలో మహిళలు కేకును కట్ చేశారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బీఆర్ఎస్ కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, నాయకులు సుభాష్, పాండు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదినం సందర్భంగా మండలంలోని ముక్రా(కె) గ్రామంలో జోగినపల్లి సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా 50 మొక్కలు నాటడం జరిగిందని మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి అన్నారు.

నేరడిగొండ: ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నేరడిగొండలోని ఆయన నివాసం వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఇందులో మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, సంతోష్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సాబ్లె నానక్ సింగ్, తదితరులున్నారు.

తలమడుగు: బోథ్ నియోజవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలు కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని లింగి వృద్ధాశ్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ 54వ జన్మదినం సందర్భంగా తాంసి, తలమడుగు మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : జిల్లా వైద్యాధికారి

ఇంద్రవెల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్ అన్నారు. సోమవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో పీఎం జన్ మన్ కార్యక్రమంలో భాగంగా సంచార వైద్య వాహనం పిట్టబొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐటీడీఏ వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా నిర్మూలనపై గ్రామాల్లో 45 రోజులపాటు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. 0-5 ఏళ్ల లోపు పిల్లల్లో విరేచనాలు నివారించడానికి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ముందస్తుగా అవసరమైన ఓఆర్ఎస్ ద్రావణం అందించనున్నట్లు వివరించారు. పిట్టబొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ ప్రతాప్ నాయక్, హెచ్ఈవో రాథోడ్ గోకుల్, హెల్త్‌సూపర్ రాథోడ్ జలేందర్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల పట్టివేత

ఇచ్చోడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై సోమవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇచ్చోడ మండలంలోని దాబా(బి) గ్రామానికి చెందిన నర్వారె ఈశ్వర్ అనే వ్యక్తి వద్ద 20 ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వీరిని విచారించగా.. ఆదిలాబాద్ పట్టణంలో ఓక వ్యక్తి వద్ద నుంచి తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు ఈశ్వర్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు విక్రయించిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన వ్యక్తిని ఆరా తీస్తున్నామన్నారు. అసలు నిందుతుడు దొరికితే మరిన్నీ విషయాలు తెలుస్తాయన్నారు. అసలు నిందితుడు పరారీలో ఉన్నాడని దొరికితే మరింత సమాచారం లభిస్తుందన్నారు. ఈ మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన వ్యక్తుల వివరాలను పట్టుబడ్డ విత్తన బస్తాల వివరాలను ఎస్సై పురుషోత్తం, మండల వ్యవసాయాధికారి భగత్ రమేష్, ఆర్ఐ హూస్సెలు తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిరికొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సీఐ బండారి రాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాంజీగూడలో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గంజాయి సాగు చేసిన, విక్రయించిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాల్య వివాహలు, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, మహిళా భద్రతపై క్లుప్తంగా వివరించారు. ఎస్సై శ్రీసాయి, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు ఏకలవ్య ఫౌండేషన్ సన్మానం

ఉట్నూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని వైష్ణవిని ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఏకలవ్య ఫౌండేషన్ విద్యా వాహిని ఆధ్వర్యంలో తమ పాఠశాల విద్యార్థిని వైష్ణవిని సన్మానించడం పాఠశాలకు గర్వకారణంగా ఉందని ప్రధానోపాధ్యాయులు జాదవ్ రమేష్ తెలిపారు.



ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెన్త్ టాపర్‌ను సన్మానిస్తున్న దృశ్యం



సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు అందుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్



ఇంద్రవెల్లిలో మొక్కలు నాటుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుకు సీఎం అభినందన

ఉట్నూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ జన్మదినం పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బొజ్జుపటేల్‌ను అభినందించారు. జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో కలిసి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, జిల్లా నాయకులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖయ్యూం, ఎక్బాల్, దాసండ్ల ప్రభాకర్, మేస్రం భాగ్యలక్ష్మి, కొత్తపల్లి మహేందర్, అజీముద్దీన్, ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ జన్మదిన వేడుకలను మండలంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీచౌక్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● ప్రజల సంక్షేమం కోసం తపించే నాయకుడు : ఉత్తం

ఇంద్రవెల్లి: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిత్యం శ్రమించే నాయకుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసుద్, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్ రావు, పట్టణ అధ్యక్షులు ఎండీ జహార్, జిల్లా నాయకులు సోన్ కాంబ్లే జితేందర్, భీం ఆర్మీ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్, మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.

భూభారతితో భూ సమస్యల పరిష్కారం

బోథ్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి కార్యక్రమాన్ని ప్రభుత్వ నిర్వహించడం జరిగిందని తహసీల్దార్ సుభాష్ చంద్ర పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో భూభారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి తమ చర్యలు తీసుకుంటామన్నారు. అయితే కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సొసైటీ డైరెక్టర్ జి.రాజు యాదవ్‌లతో పాటు పలువురు పాల్గొని వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అందివ్వడం జరిగింది.

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించేందుకే విప్లవాత్మకమైన భూ భారతి చట్టం రూపొందించిందని తహసీల్దార్ తుకారాం అన్నారు. సోమవారం సిరికొండ మండలం సుంకిడి గ్రామంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ భారతి చట్టం ద్వారా భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గతంలో సరియైనా రిజిస్ట్రేషన్ లేకుండా జరిగిన సాదాబైనామాలను క్రమబద్ధీకరించుకోవచ్చని వివరించారు. ఎంపీడీవో రవీందర్ మాట్లాడుతూ భూ భారతి 2025 చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రికార్డుల్లో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఎలా పొందాలనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఉపేందర్, సర్వేయర్ గణేష్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జైనథ్: భూభారతి చట్టంతో రైతులు ఇతరల సమస్యలన్ని పరిష్కరిస్తామని సాత్నాల మండల తహసీల్దార్ మడావి విశ్వనాథ్ అన్నారు. సోమవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని పార్డి(కె) గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాత్నాల మండల ఎంపీడీవో వెంకట్‌రాజ్, పార్డి(కె) మాజీ సర్పంచ్ అస్తక్ ఉజ్వల సుభాష్‌లతో పార్డి(కె) గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి.. అవయవదానం!

● బోథ్‌లో తల్లి కోరికను తీర్చిన తనయుడు



అంకుశ గౌరు (ఫైల్)

బోథ్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన అంకుశ గౌరు అనే వృద్ధురాలు అనారోగ్య కారణాలతో ఆదివారం మృతి చెందింది. అయితే మృతి చెందిన మహిళ బతికుండగా తన శరీరాన్ని ఇతరులకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరడంతో పాటు అప్పటి అనాటమీ విభాగానికి రాసి ఇవ్వడం జరిగింది. దీంతో ఆమె శరీరాన్ని కుమారుడు నారాయణ ముందుకు వచ్చి సోమవారం ఉదయం దానం చేశారు. దీనిలో భాగంగా గౌరు రాసి ఇచ్చిన ప్రకారం ఆమె భౌతికకాయాన్ని ఆదిలాబాద్‌లోని వైద్య కళాశాల వారికి అప్పగించేందుకు తీసుకొని వెళ్లారు. దీంతో ఆమె శరీర భాగాలు ఇతరులకు ఉపయోగపడటంతో పాటు ఆమె బతికి ఉంటుందని భావించే వీలుందని కుమారుడు పేర్కొన్నారు. తల్లి కోరిక మేరకు శవాన్ని దానం చేయడం జరిగిందన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల అందజేత

నార్నూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడ్డ పుస్తకాలను ప్రిన్సిపాల్ కేవీ కేశవులు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీరోజు కళాశాల హాజరు కావాలని, విద్యాభ్యాసంలో మంచి పేరు తెచ్చేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోటీ ప్రపంచంలో ఉద్యోగ ఉపాధి రావాలన్న మంచి మార్కులు ఉండాలి పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలాజీ కాంబ్లే, పి.ఉదయ్ కుమార్, లింగంపల్లి సుజాత, దోమకొండ సుజాత, రచన, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సోమవారం ఉచిత పార్టీ పుస్తకాలను అందించారు. విద్యార్థులు ప్రభుత్వపరంగా కళాశాలలో కల్పించే వసతులను సద్వినియోగం చేసుకోవాలని అధ్యాపకులు కోరారు.

'స్థానిక' ఎన్నికలపై నజర్!

(5వ పేజీ తరువాయి...)

పాల్పడ్డారన్న ఆరోపణలతో అధికారులు విచారణ సైతం చేపట్టారు. ఇప్పటికే కొంత మంది సర్పంచ్‌లకు నోటీసులను ఇచ్చారు. ఏమాత్రం రికవరీ కాకపోవడంతో అధికారులు కఠినమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లోను అడ్డగోలుగా వసూళ్లకు ఎగబడిన నేతలను ఈసారి ఓడించేందుకు ఓటరు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.



బీర్సాయిపేట శివారులో ప్రమాదానికి గురైన కారు

చెట్టును ఢీకొట్టిన కారు.. ఇద్దరి మృతి

● మరో ముగ్గురికి తీవ్ర గాయాలు ● ఆదిలాబాద్ జిల్లాలో ఘటన

ఉట్నూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం బీర్సాయిపేట గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీకి చెందిన ఈర్ల రాజు స్టాంపు వెండర్‌గా పని చేస్తున్నాడు. ఇతను తన భార్య సృజనిత, కొడుకు సహాన్స్ (16), కూతురు ఆద్యశ్రీతో పాటు అత్త గంట విజయలక్ష్మి (55)తో కలిసి రెండు రోజుల క్రితం ధర్మపురి, కాళేశ్వరం వంటి తీర్థయాత్రకు తన కారులో బయలుదేరాడు. దైవ దర్శనం చేసుకున్న అనంతరం సోమవారం తెల్లవారుజామున ధర్మపురి నుంచి స్వగ్రామమైన ఆదిలాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో ఉట్నూర్ మండలం బీర్సాయిపేట అటవీ ప్రాంతంలో కారు డ్రైవింగ్ చేస్తున్న రాజుకు ఒక్కసారిగా నిద్రమత్తు వచ్చింది. అప్పటికే అతివేగంతో ఉన్న కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టడంతో.. వాహనంలో ఉన్న గంట విజయలక్ష్మి, సహాన్స్ (16)లు అక్కడికక్కడే మృతి చెందారు. రాజు, సృజనిత, ఆద్యశ్రీలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం 108లో ఉట్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అక్కడి నుంచి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. గాయపడ్డ వారిలో ఆద్యశ్రీ పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● చిన్నారి త్వరగా కోలుకోవాలి : జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్: ఉట్నూర్ మండలం బీర్సాయిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం పై మాజీ మంత్రి జోగు రామన్న తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం రోడ్డు ప్రమాదంలో గాయాలతో చికిత్స పొందుతున్న చిన్నారి త్వరగా కోలువాలని ఆయన కోరారు. భాగ్యనగర్‌కు చెందిన గంట చంద్రశేఖర్ సతీమణి గంట విజయతో పాటు మనుమడు సంఘటన స్థలంలోనే మృతి చెందడం బాధాకరమన్నారు. తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయాలతో చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని కోరారు.

రైలు కింద పడి ఒకరి మృతి

తలమడుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమడం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఒకరు మృతి చెందినట్లు రైల్వే శాఖ అధికారులు ప్రభాకర్ తెలిపారు. పూర్తి వివరాల ప్రకారం ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన నిమ్మల సంతోష్ (37) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించుకుంటున్నారని ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.



బన్సపల్లి రైతువేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, అధికారులు

ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం

● వీడియో కాన్ఫరెన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

దిలావర్‌పూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం... రైతుల కోసం ఇప్పటి వరకు లక్ష కోట్లు ఖర్చు చేశాం. ఇంకా ఎన్ని కోట్లు అయినా ఖర్చు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడారు. రైతులకు అన్ని విధాలుగా బాసటగా నిలబడతామని అన్నారు. వారం పది రోజుల్లో రైతు భరోసా డబ్బులు వేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే రైతులకు రైతు బీమా ఇస్తున్నామన్నారు. రూ. రెండు లక్షల రుణమాఫీ చేశామన్నారు. బన్సపల్లి, గుండంపల్లి రైతు వేదికల్లో రైతులు సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వారం రోజుల్లో రైతు భరోసా నిధులను రైతు ఖాతాల్లో వేసి పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. కాగా ఆయా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లో పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, ఎంపీడీవో అరుణరాణి, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి, రైతులు కట్కం రాజారెడ్డి, కోడె నవీన్, ఉమాశంకర్, పోశెట్టి, ఏఈవోలు పాల్గొన్నారు.

● లక్ష్మణచాంద రైతులతో ముఖాముఖి

లక్ష్మణచాంద, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా రైతువేదికల్లో రైతునేస్తం - సీఎం రేవంత్‌రెడ్డితో రైతుల ముఖాముఖి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. క్లస్టర్ గ్రామాలైన పీచర, లక్ష్మణచాంద, వడ్యాల్ గ్రామాల్లో గల రైతువేదికల్లో ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎస్సై శ్రీనివాస్, వ్యవసాయ అధికారి వసంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, ఆత్మ డైరెక్టర్ సమ్మెట రవి, ఇతర పోలీస్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతువేదికలో రైతునేస్తం

ముథోల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ రైతువేదికలో రైతులకు సాయంత్రం 4 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవ సాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించిన కార్యక్రమాన్ని రైతులకు ఇక్కడి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించేలా సౌకర్యాన్ని కల్పించారు.రైతు లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ఏవో రచన, ఏఈవోలు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు

కుంటాల, జూన్, 16 : (ఆంధ్రజ్యోతి) : రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని డీపీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కుంటాలతో పాటు కల్లూరు, ఓలా రైతువేదికల్లో నూతన వీడియోకాన్ఫరెన్స్ యూనిట్లను ప్రారంభించిన సందర్భంగా ఆయన కుంటాలలో రైతువేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ క్రిమిసంహారక మందుల వాడకం తగ్గిస్తూ పంట మార్పిడి విధానం చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నూతన వీడియోకాన్ఫరెన్స్ యూనిట్లను ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, తహసీల్దార్ కమల్‌సింగ్, వ్యవసాయాధికారి విక్రమ్‌తో పాటు ఏఈవోలు, రైతులు ఉన్నారు.

కాంట్రాక్టు బిల్లులు మంజూరు చేయండి మహాప్రభో

● రాజురలో పాఠశాలకు తాళం వేసి ఓ కాంట్రాక్టర్ ఆందోళన ● రూ. 37లక్షలతో బడి కడితే.. రూ.23లక్షల బిల్లు పెండింగ్‌లో పెట్టారని ఆవేదన

● పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం ● పోలీసులు సముదాయించడంతో తెరుచుకున్న పాఠశాల




పాఠశాలకు తాళం వేసి గేటు ముందర బైఠాయించిన కాంట్రాక్టర్ శ్రీనివాస్‌ను సముదాయిస్తున్న పోలీసులు



ఒంటిపై పెట్రోల్ పోలీసుకుంటుండగా బాటిల్ లాగేస్తున్న స్థానికులు

ఖానాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తాము చేసిన కాంట్రాక్ట్ పనుల తాలూకు బిల్లులు మంజూరు చేయాలంటూ ఓ కాంట్రాక్టర్ ఏకంగా తాను నిర్మించిన పాఠశాలకు తాళం వేసి ఆత్మహత్యకు యత్నించిన ఘటన జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని ఖానాపూర్ మండలం రాజుర గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్ కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్నాడు. ఇతను గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన 'మన ఊరు మన బడి' పథకంలో భాగంగా ఇదే గ్రామంలోని పాఠశాలలో రూ. 37 లక్షల నిధులతో భవనాన్ని నిర్మించగా.. రూ. 14లక్షలు బిల్లులు చేతికి వచ్చాయి. మిగిలిన రూ. 23లక్షలు ఇప్పటికీ రాలేదు. గత మూడేళ్లుగా శ్రీనివాస్‌కు భవన నిర్మాణం తాలూకు బిల్లులు మంజూరు కాలేదు. దీంతో శ్రీనివాస్ గత కొద్ది రోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయమై ప్రతీరోజు అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాడు. దీంతో సోమవారం పాఠశాల వద్దకు వచ్చి.. తనకు చెల్లించాల్సిన బిల్లులు వచ్చే వరకూ పాఠశాల భవనంలోకి ఎవరినీ వెళ్లనిచ్చేది లేదంటూ తాళం వేసి.. ఆందోళన చేశాడు. ఆ తర్వాత గేటు బయట పెట్రోల్ డబ్బాతో కూర్చుకున్నాడు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి.. తనకు రావాల్సిన రూ. 23లక్షల బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశాడు. లేని పక్షంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడతానంటూ శ్రీనివాస్ పోలీసుల ఎదుటే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడే ఉన్న గ్రామస్థులు, ఇతర పార్టీల నాయకులు శ్రీనివాస్ చేతిలోంచి పెట్రోల్ డబ్బాను లాక్కొని పక్కన పడేశారు. క్షణికావేశంలో ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడవద్దంటూ శ్రీనివాస్‌ను పోలీసులు సముదాయించారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పోలీసులు హామీ ఇవ్వడంతో శ్రీనివాస్ వెనక్కి తగ్గి పాఠశాల గేట్లను తెరిచాడు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాల భవన నిర్మాణం కోసం తాను అప్పులు చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నానన్నారు. అధికారులు తనకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెడితే ఇకపై సహించబోనన్నారు. వారం రోజుల్లోపు తనకు రావాల్సిన బిల్లును చెల్లించకపోతే.. మరోసారి పాఠశాలకు తాళం వేస్తానని హెచ్చరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.



సత్తెనపల్లి రైతు వేదిక ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వివాదాస్పదమైన ఏఈవో మెసేజ్

● రైతునేస్తం కార్యక్రమానికి కాంగ్రెస్ మండల నాయకులు హాజరుకావాలని వాట్సాప్ గ్రూపులలో ఏఈవో రాకేష్ సందేశం ● అధికారుల తీరుపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం- సత్తెనపల్లి రైతు వేదిక ఎదుట ఆందోళన

ఖానాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రైతునేస్తం కార్యక్రమానికి హాజరు కావాలంటూ వాట్సాప్ గ్రూపుల ద్వారా సత్తెనపల్లి ఏఈవో రాకేష్ చేసిన మెసేజ్ వివాదాస్పదమైంది. ఈ మెసేజ్‌లో సదరు ఏఈవో అధికారులతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్, మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు, మీడియా ప్రతినిధులకు ఈ ఆహ్వానం అంటూ మెసేజ్ చేయడానికి బీఆర్ఎస్ శ్రేణులు తప్పుపట్టాయి. సోమవారం ఎర్వచింతల్ మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కే. గోపాల్ ఆధ్వర్యంలో మండలంలోని సత్తెనపల్లి రైతు వేదిక ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాజీ సర్పంచ్ గోపాల్‌తో పాటు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శనిగారపు శ్రావణ్‌లు మాట్లాడుతూ అధికారుల తీరును తప్పుపట్టారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆదేశాల మేరకే మండల స్థాయిలో ఏవో, ఏఈవోలు ఇటువంటి మెసేజ్‌లు పెడుతున్నారని మండిపడ్డారు. రైతుల సమావేశాలకు, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు నాడు తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు వేదికలను అధికారులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మార్చడం సరికాదన్నారు. రైతుల కోసం ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు రైతులతో పాటు ప్రజాప్రతినిధులను, మాజీ ప్రజాప్రతినిధులను అందరినీ ఆహ్వానించాలన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు ఆహ్వానం అంటూ ఏఈవో మెసేజ్ చేయడం ఎంతవరకు సమంజసం అంటూ మండిపడ్డారు. అధికారులు రాజకీయ పార్టీలకు కొమ్ముకాసేలా వ్యవహరించవద్దని సూచించారు. ఈ ఘటనకు కారకులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎంపీడీవోకు ఏఈవో చేసిన మెసేజ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ నిరసనలో బీఆర్ఎస్ నాయకులు కడెం మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు శ్యామ్‌సుందర్, ఏ. బక్కన్న, అల్లి రాజమల్లు, రాజు, అల్లి మల్లేష్, జక్కుల నర్సయ్య, తదితరులు న్నారు.

చూసుకోకుండా ఫ్రెండ్స్ పంపిన మెసేజ్‌ను ఫార్వర్డ్ చేశాను

● రాకేష్, ఏఈవో, సత్తెనపల్లి

ముఖ్యమంత్రి రైతు నేస్తం కార్యక్రమానికి హాజరు కావాలనే సందేశాన్ని పంపే క్రమంలో ఇతర గ్రూపులలో వచ్చిన మెసేజ్‌ను ఫార్వర్డ్ చేశాను. మా ఫ్రెండ్స్ గ్రూపులో వచ్చిన మెసేజ్‌లో స్థలం, గ్రామం పేర్లను మాత్రమే మార్చి మిగతా మ్యాటర్‌ను చదవకుండా పోస్ట్ చేయడంతో ఈ తప్పిదం జరిగింది. వేరే వాళ్లు చూసి చెప్పిన వెంటనే మెసేజ్ డిలిట్ చేసి వేరే మెసేజ్‌ను పోస్ట్ చేశారు. ఉద్దేశపూర్వకంగా చేయలేదు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

నర్సాపూర్(జి), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తురాటి గ్రామంలో సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌కు గురై ఒక ఎద్దు మృతి చెందింది. తురాటి గ్రామానికి చెందిన రైతు సట్ల నారాయణ గత మూడు నెలల క్రితం గన్నారం గ్రామం నుంచి లక్ష 30 వేల రూపాయలకు ఎడ్ల జతను కొనుగోలు చేశారు. జీవనాధారం కోసం వీటిపైనే ఆధారపడిన రైతుకు ఈ ఘటన తీరని నష్టాన్ని మిగిల్చింది. సోమవారం ఎద్దును మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ నియంత్రిక నుంచి ప్రవహించిన విద్యుత్‌షాక్‌కు గురై ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు 65,000 రూపాయలు ఉంటుందని రైతు తెలిపాడు.

సామూహిక అక్షరాభ్యాసం

ముథోల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన ముథోల్‌లోని రైతువేదికలో సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారు లకు అక్షరాభ్యాసాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని 14 అంగన్‌వాడీ సెంటర్ల 25 మంది పిల్లలకు అక్షరాభాస్యం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో సరోజిని, అంగన్‌వాడీ టీచర్లు అనీల, శ్రీదేవి, చిన్నబాయి, సునీత, అమృత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలున్నాయి.. జాగ్రత్త

ముథోల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నేటి నుండి భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ కే. శ్రీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోతట్టు, ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే చెరువులు, గోదావరి నది పరివాహక ప్రాంతంలో జాలర్లు కానీ, పశువుల కాపర్లు కానీ వెళ్లకూడదని సూచించారు.

కడ్తాల్ ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ దినోత్సవం

సోన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి అక్షరాలు సంఖ్య ఆకారాలు మొదలగు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను బోధనోపకరణాలను తయారు చేసి ప్రదర్శించారు. పాటలు, కథలను చదివి వినిపించారు. మండల విద్యాధికారి పరమేశ్వర్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు మంగమ్మ, రాధ, జ్యోతి పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో డ్రై డే కార్యక్రమం

సోన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాంధీనగర్ గ్రామంలో వర్షాకాలం దృష్ట్యా సంభవించే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, డయేరియా మొదలకు వ్యాధులు ప్రబలకుండా డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ జ్వర పీడితులు ఉన్నారా అని సర్వే నిర్వహించి, పరిశుభ్రత గురించి వైద్య సిబ్బంది తెలియజేశారు.

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

● జిల్లాలో సరిచేయబడిన వంగిన పోల్స్ 622 ● నియంత్రిక ఎత్తు పెంచిన గద్దెలు 107 ● పడిపోయిన పోల్స్ సరి చేసినవి 466
● ఫీడర్‌లో ఉన్న విరిగిన పోల్స్ సరిచేసినవి 725 ● లూస్ లైన్ల మధ్యలో వేసిన పోల్స్ 2,622
● తుప్పు పట్టిన స్తంభాలను తొలగించి సిమెంట్ పోల్స్ వేసినవి 678 ● నిర్మల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. సుదర్శన్



విద్యుత్ పొలం బాట కార్యక్రమంలో భాగంగా వంగిపోయిన స్తంభాలను సరి చేస్తున్న విద్యుత్ సిబ్బంది

ముథోల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వాతావరణ శాఖ రాబోయే రోజుల్లో భారీ వర్షాలు పడనున్నాయన్న నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా రైతులు విద్యుత్ ప్రమాదాల పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని నిర్మల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. సుదర్శనం స్పష్టం చేశారు. గ్రామాల్లో గాని వ్యవసాయ చేనులో గాని విద్యుత్ స్తంభాలు వంగిన, విరిగిన సంబంధిత వైర్లు లూజ్ అయిన, తెగి పడ్డ వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు వహించాలని కోరారు. నిర్మల్ జిల్లా పరిధిలో ఇప్పటి వరకు వినియోగ దారులకు అంతరాయం, ఎటువంటి అపాయం కలుగకుండా విద్యుత్ శాఖ తగు చర్యలు చేపట్టింది. నిర్మల్ జిల్లా పరిధిలో ఇప్పటి వరకు సరి చేయబడిన వంగిన పోల్స్ మొత్తం 622, నియంత్రిక ఎత్తు పెంచిన గద్దెలు 107, గాలివానకు పడిపోయిన పోల్స్ సరిచేసినవి 466, ఫీడర్‌లో ఉన్న విరిగిన పోల్స్ సరిచేసినవి 725, లూస్ లైన్ల మధ్యలో వేసిన పోల్స్ మొత్తం 2,622, తుప్పు పట్టిన స్తం భాలను తొలగించి వాటి స్థానంలో 678 సిమెంట్ పోల్స్ వేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. సామర్థ్యం తగ్గిన (కాలం చెల్లిన) కండక్టర్ వైర్లను తొలగించి వాటి స్థానంలో నూతన కండక్టర్ వైర్లను 20 కేఎం అమర్చడం జరిగిందన్నారు. అలాగే పొలం బాట కార్యక్రమంలో భాగంగా వంగిపోయిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ సిబ్బంది వెనువెంటనే సరిచేయడం జరిగిందని పేర్కొన్నారు.



విద్యుత్ మరమ్మతుల కోసం ఏర్పాటు చేసిన యుటిలిటీ వ్యాన్

రైతు సోదరులకు విజ్ఞప్తి..

రైతు సోదరులు విద్యుత్ శాఖ వద్ద ఆమోదించబడిన సామర్థ్యం కన్నా ఎక్కువ సామర్థ్యం గల మోటార్లను వాడిన యెడల వాటి వివరాలను రాత పూర్వకంగా విద్యుత్ సిబ్బందికి ఖచ్చితంగా తెలియజేయాలని కోరారు. దీనికి ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదు. మీ మోటార్ల సామర్థ్యంను బట్టి నియంత్రిక సామర్థ్యం పెంచడం కాని లేదా అదనపు నియంత్రికను బిగించబడుతుందని పేర్కొన్నారు. నియంత్రిక ఎట్టి పరిస్థితిలోను కాలిపోకుండా, మీకు విద్యుత్ సరఫరాలో ఎటాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడం జరుగుతుందని వివరించారు. అనధికారికంగా నియంత్రిక వద్ద ఫ్యూజ్‌లు మార్చడం కాని ఏబీ స్విచ్‌ను ఆపరేట్ చేయరాదు. అవసరం నిమిత్తం సంబంధిత అధికారికి తెలియజేయగలరని పేర్కొన్నారు.

వినియోగదారులకు విజ్ఞప్తి...

● మీ పరిధిలో గల వినాయక విగ్రహాలను తరలించి, మండపాల దగ్గర పెట్టేటప్పుడు విద్యుత్ నిలిపి వేయవలసి వస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించి, విద్యుత్ నిలిపివేసినట్టు నిర్ధారించుకున్న తర్వాతనే తదుపరి కార్యక్రమాలు నిర్వహించగలరు.

● సర్వీస్ వైర్లకు సపోర్ట్‌గా ఇచ్చిన జీఐ వైర్లకి బట్టలు ఆరవేయుట ప్రమాదకరము, సర్వీస్ వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలి.

● విద్యుత్ వైర్లు ప్రమాదవశాత్తు తెగిపడినచో వాటిని పట్టుకోరాదు. వెంటనే దగ్గరలో ఉన్న విద్యుత్ కార్యాలయానికి తెలియజేయగలరు.

● వర్షాకాలంలో ఇనుప స్తంభాలను తాకరాదు. ఒకవేళ విద్యుత్ ప్రసారం అవుతున్నట్లు గమనించినచో వెంటనే సంబంధిత అధికారికి తెలియజేయగలరు.

● ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తిన పరిష్కారం కొరకు సంబంధిత అధికారికి తెలియజేయగలరు. ఒకవేళ అధికారి స్పందించని యెడల విద్యుత్ టోల్ ఫ్రీ నంబర్ 1912కి సమాచారం ఇవ్వగలరని సూచించారు. విద్యుత్ శాఖకు సహకరించి మెరుగైన సేవలను పొందాలని కోరారు.

చిత్తడిగా కుభీర్ ఆసుపత్రి ప్రాంగణం



వరద నీటితో చిత్తడిగా మారిన ఆసుపత్రి ప్రాంగణం

కుభీర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన వర్షాలకు కుభీర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వర్షపు నీరు చేరి చిత్తడిగా మారింది. దీంతో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రోగులు ఆసుపత్రి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. మరికొందరు చిత్తడిలో జారి పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోగులకు సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం

● పట్టించుకోకపోతే ప్రమాదమే



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

భైంసా రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇలేగాం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన రెండు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నారు. 80 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో రెండు భవనాలు పాతవి కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల అంతర్ని పాఠశాల భవనం కూలి ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చాలని ఇలేగాం గ్రామస్థులు, అధికారులు కోరుతున్నారు.

హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోండి : తహసీల్దార్ శ్రీకాంత్



నర్సాపూర్(జి) తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారి

నర్సాపూర్(జి), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భూ భారతి హెల్ప్ డెస్క్ సేవలను రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీకాంత్ కోరారు. భూమికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో ఈ హెల్ప్ డెస్క్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

భారీ స్పందన.. ఒక్క రోజే 15 దరఖాస్తులు

ప్రారంభించిన కొద్ది రోజులకే భూ భారతి హెల్ప్ డెస్క్‌కు రైతుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. కేవలం ఒక్కరోజులోనే 15 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇది భూ సమస్యల పరిష్కారం పట్ల రైతుల ఆసక్తి ని, హెల్ప్ డెస్క్ ఆవశ్యకతను తెలియజేస్తోంది.

రెవెన్యూ సదస్సుల్లో 181 దరఖాస్తులు..

ఇప్పటికే గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ భారతి కార్యక్రమం కింద మొత్తం 181 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ వెల్లడించారు. ఈ సదస్సులకు హాజరుకాలేకపోయిన లేదా అప్పుడు దరఖాస్తులు సమర్పించని రైతులు నిరాశ చెందవద్దని, వారి కోసమే ఈ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయబడిందని ఆయన తెలియజేశారు.

రశీదు తప్పనిసరి..

హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తులు సమర్పించే రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఈ రసీదు భవిష్యత్తులో దరఖాస్తు పురోగతిని తెలుసుకోవడానికి సహాయ పడుతుందని, తద్వారా తమ భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. భూమికి సంబంధించిన రికార్డుల ప్రక్షాళన, సరిహద్దుల వివాదాలు, హక్కు పత్రాల జారీ వంటి అనేక సమస్యలకు ఈ హెల్ప్ డెస్క్ ద్వారా పరిష్కారం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

క్రమంగా పెరుగుతున్న ఉల్లి ధరలు

● పక్షం రోజుల వ్యవధిలో రూ.10 నుంచి రూ.25కు ఎగబాకిన ధరలు



ఉల్లిగడ్డలు



ఉల్లి పంట

భైంసా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో ఉల్లి ధరలు క్రమక్రమంగా పెరుగుదల బాటలో పయనిస్తున్నాయి. కోయకుం డానే కంటనీరు పెట్టిస్తున్నాయి. గత నెలలో చివరలో జిల్లాలోని వివిధ మార్కెట్లలో కిలో ఉల్లిగడ్డలు రూ.10తో లభ్యమవ్వగా ప్రస్తుతం రూ.25లకు ఎగబాకాయి. పక్షం రోజుల వ్యవధిలో ఉల్లి ధరలు రెట్టింపు స్థాయిని దాటి పోయాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఈ సంవత్సరం ఉల్లిసాగు గణనీయంగా తగ్గింది. దీనికితోడు వివిధ కారణాలతో దిగుబడులు సైతం తగ్గి పోయాయి. ఈ కారణంగా డిమాండ్‌కు తగ్గట్లుగా దిగుబడులు లేకపోవడం మూలంగా మార్కెట్ పరిధిలో ధరల్లో పెరుగుదల చోటు చేసుకుంటోందని రిటేల్ వ్యాపారులు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఇక్కడి ప్రాంతంలో ఉల్లి దిగుబడులు లేకుండా పోయాయి. జిల్లా మార్కెట్‌కు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి ఉల్లి దిగుబడులు దిగుమతి అవుతున్నాయి. జిల్లాలోని హోల్ సెల్ వ్యాపారులు సుదూరంలోనున్న మహరాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి ఉల్లిని సరఫరా చేసుకొని మార్కెట్లలో విక్రయాలు చేపడుతున్నారు. దీంతో ఉల్లి ధరలు క్రమక్రమంగా పెరుగుతూ రెట్టింపు స్థాయిని దాటిపోయాయి. రానున్న రోజుల్లో ధరలు మరింతగా పెరిగే అవకాశముందని తెలుస్తోంది.

ప్రచార బోర్డుల కోసం.. పర్యావరణానికి తూట్లు

● వృక్షానికి గాయాలిలా
● పర్యావరణ రక్షణ ఎలా..!?



ఇచ్చోడలో వృక్షానికి మేకులు కొట్టి అతికించిన ప్రైవేటు కంపెనీకి చెందిన ప్రచారబోర్డులు

ఇచ్చోడ, జూన్, 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి పెంచాలని ఒక వైపు ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. మరోవైపు కొందరి స్వార్థంతో వృక్షాలు నిశించి పోతున్నాయి. ఇచ్చోడ మండలంలోని జాతీయ రహదారి పక్కనున్న వృక్షాలకు ఇనుప చువ్వలతో తగిలించిన ప్రచార బోర్డులే దీనికి నిదర్శనం. కొన్ని ప్రైవేటు సంస్థలు తమ ప్రచార బోర్డులను తగిలించేందుకు చెట్టుకు ఇలా ఇనుప చువ్వలు, మేకులతో కొట్టి పర్యావరణ శత్రువులుగా మిగిలి పోయారు. మేకులు కొట్టిన రంధ్రాలు తొర్రలుగా మారి చెట్లు విరిగిపోతున్నాయని వృక్ష ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీధులు ఇలా ఉంటే.. వ్యాపించవా వ్యాధులు!

పట్టణ నడిబొడ్డున ఉన్న రవీంద్రనగర్ కాలనీ మురికి కూపంగా మారింది. ఎక్కడ చూసిన పేరుకుపోయిన చెత్త చెదారం, రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీటికి తోడు వర్షాల కారణంగా ఏర్పడిన గుంతలతో నడవడానికి సైతం వీలు లేకుండా మారింది. మున్సిపల్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న కాలనీ చెత్తతో నిండి పోయి దుర్గంధం వ్యాపిస్తుండడం పురపాలక యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడు తోంది. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు స్పందించి పరిసరాలు పరిశుభ్రం చేయాలని, నిత్యం పారిశుధ్యం పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)





రవీందర్‌నగర్ కాలనీ డ్రైనేజీలు, రోడ్లు



ఫొటో న్యూస్

సెల్ఫ్ లేపని బస్సుతో తప్పని తిప్పలు



బోథ్ బస్టాండ్‌లో సోమవారం సెల్ఫ్ లేని బస్సును తోస్తున్న ప్రయాణికులు

బోథ్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి వచ్చిన అంతర్రాష్ట్ర బస్సు సర్వీస్ కిన్వాట్ వెళుతుంది. అయితే ఆ బస్సు బస్టాండ్‌లోకి రాగానే సెల్ఫ్ లేపకపోవడంతో బస్సులో వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సు దిగి ముందుకు పోవడం జరిగింది. అయితే అధికారులు ఈ రూట్లో కండిషన్లో ఉన్న బస్సులను నడిపించాలని కోరుతున్నారు.



కదిలి పాప హరేశ్వర స్వామి గర్భ గుడిలో నీటితో నింపిన రైతులు

శివయ్యా.. గంగను విడువయ్యా!

● కదిలి పాపన్నకు ఆర్ధపాయసం.. ● జలాభిషేకం పూజలు

దిలావర్‌పూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గుట్ట మీది గ్రామాల్లో వర్షాభావం వల్ల విత్తనాలు వేసుకోలేక ఇబ్బంది పడుతున్న రైతులు వర్షం కోసం కదిలి పాప హరేశ్వర స్వామిని ఆశ్రయించారు. సోమవారం కదిలి గ్రామానికి చెందిన రైతులు కదిలి ఆలయానికి చేరుకున్నారు. బిందెలతో గర్భగుడిలో శివలింగంపై నీరుపోశారు. అనంతరం పాయసంతో నైవేద్యం సమర్పిం చారు. ప్రత్యేక పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంట సల్లంగా ఉండేలా చూడాలని శివయ్యను వేడుకున్నారు. ఈ సందర్భంగా గర్భ గుడిలోకి భక్తుల ప్రవేశాన్ని మంగళవారం వరకు నిషేధించారు. యథావిధిగా భక్తుల దర్శనం చేసుకోవచ్చని, మంగళవారం ఉదయం తిరిగి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తిరిగి భక్తులను గర్భ గుడిలోకి అనుమతించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

తలమడుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో సోమవారం 47వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత 47 సంవత్సరాల క్రితం గ్రామస్తుల సహకారంతో వేంకటేశ్వర ఆలయాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసంలో బ్రహ్మోత్సవాలు స్వామి వారి కళ్యాణం, రథోత్స కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఆలయం నిర్మించిన నాటి నుంచి నేటి వరకు ప్రతీరోజు ధూప దీప నైవేద్య కార్యక్రమాలు వేద పండితులతో నిర్వహిస్తున్నమన్నారు.

వేడుక ఏదైనా.. సందర్భం ఎటువంటిదైనా

- వివాహ వార్షికోత్సవం
- స్వదేశీ, విదేశీయానం
- లీగల్ ప్రకటనలు
- పదవీ విరమణ
- శ్రద్ధాంజలి
- జన్మదినం
- షష్టిపూర్తి
- జయంతి
- వర్ధంతి
- క్లాసిఫైడ్స్



మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా అతి తక్కువ రేట్లకే శుభాకాంక్షలు తెలియజేయండి

ఆంధ్రజ్యోతి ప్రకటనల కొరకు సంప్రదించండి

ఆదిలాబాద్: 99854 11291
నిర్మల్ : 80966 77672
యాడ్స్ మేనేజర్ : 99854 11453

ఉదయం ఆరు గంటలకే ఆలయాన్ని తెరవాలి

దిలావర్‌పూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కాల్వ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ఉదయం 6 గంటలకే తెరవాలని సోమవారం కాల్వ దేవస్థానం పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. స్వామివారి నిత్యపూజ కార్యక్రమాలు ప్రారంభం ఆలస్యమవుతోందని భక్తులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు దేవస్థానం చైర్మన్ అంగూరి మహేందర్ తెలిపారు. సిబ్బంది తీరు మార్చుకోవాలని ఆయనహెచ్చరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ తీసుకోవాలని ఆలయ ఈవో భూమయ్యను కోరారు.

బాసర తీరంలో ఏదీ రక్షణ?



నది వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు
స్నానఘట్టాల వద్ద భక్తుల రద్దీ

- నదీతీరంలో శాశ్వత ప్రమాద నివారణ చర్యలు చేపట్టాల్సిందే అంటున్న భక్తులు
- నామమాత్రంగా కాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలంటున్న యాత్రికులు
- తాజా ఘటనతో నాటు పడవలను నిషేధిస్తూ.. ప్రభుత్వ ఉత్తర్వులు
- స్నానఘట్టాల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

బాసర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : భక్తుల పూజలు, గోదావరిలో పుణ్యస్నానాలతో కలకళలాడే బాసర గోదావరి నది తీరంలో నిత్యం ఏదో ఒక ప్రమాదంతో వార్తల్లోకెక్కుతుంది. ఏడాదిలో దాదాపు పది దుర్ఘటనలు జరుగుతుంటాయి. 15 మంది వరకు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు నదీ తీరాన్ని సందర్శిస్తుంటే.. ఇక్కడ మాత్రం భద్రత లోపాలు శాపంగా మారుతున్నాయి. ఇప్పటి వరకు ఎంతోమంది భక్తులు పుణ్యస్నానాల కోసం నదిలో దిగి మృత్యువాత పడ్డారు. బాసర వచ్చి ఎన్నో కుటుంబాలు ఆప్తులను కోల్పోయాయి. ఘటన జరిగినప్పుడు అధికార యంత్రాంగం హడావుడి తప్ప శాశ్వత ఏర్పాటు చేపట్టడం లేదని విమర్శలు ఉన్నాయి. భక్తుల భద్రత విషయంలో పర్యవేక్షణ లేకపోవడం కూడా భక్తుల ప్రాణాలకు భరోసా లేకుండా పోతుంది. తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకోవడంతో గత కొన్నేళ్ల నుంచి ప్రమాదాలు ఆగడం లేదు. ఆదివారం నాడు ఐదుగురు యువకులు నడుములోతు ఉన్న నదిలో దిగి లోతు ప్రదేశం తెలియక నీట మునిగి మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే.. ఈ ఘటనతో అయినా మేల్కొని శాశ్వతభద్రత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ముగ్గురే గజ ఈతగాళ్లు

ప్రస్తుతం దేవస్థానం తరుపున ముగ్గురు గజఈతగాళ్లు ఉంచుతున్నట్లు అధికారులు చెపుతున్నారు. కానీ పర్యవేక్షించేవారు లేకపోవడంతో సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. గత ఈతగాళ్ల సంఖ్యను పెంచి పర్యవేక్షణ కూడా జరపాలి.

లోపలికి వెళ్లకుండా కంచెలను ఏర్పాటు చేయాలి

అనేక దేవస్థానాలలోని నదీ తీరాల్లో భక్తులు లోతైన ప్రదేశాలకు వెళ్లకుండా ప్రమాదాలకు లోను కాకుండా కంచెలను ఏర్పాటు చేసి విధంగా ఇక్కడ కూడా ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

గోదావరి వంతెన నుంచి శివాలయం వరకు దాదాపు 500 మీటర్ల స్నానఘట్టాలు ఉన్నాయి. భక్తులకు తెలియక ప్రతి స్నానఘట్టం దగ్గర స్నానాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వినియోగం లేని ఘాట్లవద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గోదావరి వంతెన వద్ద రెండు ఘాట్లు, శివాలయం వద్ద ఉన్న రెండు ఘాట్లను మాత్రమే వినియోగించుకునేలా ఏర్పాటు చేయాలి. మిగతా ఘాట్ల ద్వారా భక్తులు నీటిలోకి వెళ్లకుండా కంచె వంటి ఏర్పాట్లు చేయాలి.


ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే


బాసరలో నాటు పడవ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

ఇది తప్పనిసరి

భక్తుల రద్దీ అధికంగా ఉండే శివాలయం ఘాటువద్ద ఒక వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేయాలి. ఇలాంటి వ్యవస్థ సముద్ర తీర ప్రాంతాల్లో, బీచ్‌ల వద్ద కనిపిస్తుంది. అక్కడ ఒక వ్యక్తి నిరంతరం స్నాన ఘట్టాలను కాపలాకాస్తూ.. భక్తులు నీటి లోపలికి వెళ్లకుండా హెచ్చరించాలి. వినకపోతే నది వద్ద ఉన్న గజ ఈతగాళ్లను అప్రమత్తం చేసి నది లోనికి వెళ్లే భక్తులను ఒడ్డుకు పంపించేలా వ్యవస్థ ఉండాలి.

దొంగతనాలకు అంతేలేదు

గోదావరి తీరంలో ప్రమాదాలతో పాటు దొంగతన ఘటనలు కూడా ఎక్కువవుతున్నాయి. వారంలో మూడు నుంచి నాలుగు ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. భక్తులు విలువైన వస్తువులను నది ఒడ్డున ఉంచి స్నానాల కోసం నదిలో దిగితే అదే సమయంలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బంగారం, నగదు, ఫోన్‌లు మాయమవుతున్నాయి. గుడ్డల్లో భద్రపరిచి మెట్లపై ఉంచితే గుడ్డలతో సహా ఎత్తికెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయి. తాజాగా ఓ మహిళా భక్తురాలి బట్టలన్ని దొంగతనానికి గురికావడంతో అక్కడున్న స్థానిక వ్యాపారులు సమకూర్చారు. తిరిగు ప్రయాణానికి భక్తులకు డబ్బులు కూడా అడుక్కోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన పోలీసులు

గోదావరి తీరంలో జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో సోమవారం బాసర పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. స్నానఘట్టాల వద్ద భక్తులు నదిలోకి వెళ్లే మార్గంలో సూచనలు ఇచ్చే ముందస్తు జాగ్రత్తలతో కూడిన బోర్డును ఏర్పాటు చేశారు.

నదీ తీరాన్ని సందర్శించిన ముథోల్ ఎమ్మెల్యే

గోదావరి నదిలో ఐదుగురు భక్తులు నీట మునిగి చనిపోయిన ఘటన నేపథ్యంలో సోమవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బాసర గోదావరి తీరాన్ని సందర్శించారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

బాసర గోదావరి నది తీరాన్ని సోమవారం జిల్లా ఎస్పీ జనకీ షర్మిల పరిశీలించారు. ఐదుగురు భక్తులు పుణ్యస్నానాల కోసం నదిలో దిగి మృతి చెందిన విషయం తెలిసిందే.. ఈ ఘటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ స్నాన ఘట్టాల పరిసరాలను పర్యవేక్షించి భక్తుల రద్దీ, నది లోతు, చేపట్టాల్సిన చర్యల గురించి స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎస్పీ వెంట ముథోల్ సీఐ, బాసర పోలీసులు ఉన్నారు.

నాటు పడవలు నిషేధిస్తూ ఉత్తర్వులు

ఆదివారం ఘటన నేపథ్యంలో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. గోదావరి తీరంలో స్థానిక మత్స్యకారులు నిర్వహించే నాటు పడవలను నిషేధిస్తూ.. సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు నిర్మల్ ఆర్డీవో కోమల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఒకవేళ ఉల్లంఘించి నాటు పడవలను నడిపిస్తే.. కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చిన భక్తులను నాటుపడవలపై కూర్చొబెట్టుకొని నదిలో తిప్పి ఒడ్డుకు తీసుకొచ్చే వారు. ఆదివారం ప్రమాదంలో చిక్కుకున్న భక్తులను కూడా నాటు పడవల నిర్వాహకులు నదిలో ఇసుక మేటల వద్దకు తీసుకెళ్లారు. స్నానానికి నీరు శుభ్రంగా ఉంటాయనే ఉద్దేశ్యంతో భక్తులు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తారు. కానీ నాటు పడవల నిర్వాహకులు కనీస ముందస్తు భద్రత ఏర్పాట్లు నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలకు కారణమవుతున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు సరైన రక్షణ లేని నాటు పడవలపై ప్రయాణం ప్రమాదమని ప్రభుత్వం నిషేధించింది.


బాసర గోదావరి తీరంలో నడిచే నాటు పడవలు


విద్యార్థులు ఎఫ్‌ఎల్‌ఎన్ సామర్థ్యాలు సాధించాలి

- అంగన్‌వాడీ పిల్లలను ఒకటో తరగతిలో నమోదు చేసుకోవాలి
- జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త ఎన్. ప్రవీణ్‌కుమార్


విద్యార్థులను పరీక్షిస్తున్న విద్యాశాఖ సమన్వయకర్త

నిర్మల్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ పిల్లలను ఒకటో తరగతిలో నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త ఎన్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎంపీపీఎస్ శాంతినగర్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో విద్యార్థుల నమోదు వివరాలు, హాజరు వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాఠశాలలో మొత్తం 95 మందికి గాను 66 మంది హాజరయ్యారన్నారు. అంగన్‌వాడీలోని 5ప్లెస్ వయసు గల పిల్లలందరినీ గుర్తించి, 1వ తరగతిలో నమోదు చేయాలన్నారు. ఇదివరకే నమోదు చేశామని ప్రధానోపాధ్యాయులు తెలపడం జరిగింది. అలాగే బడిబాటలో భాగంగా పాటశాలలోని విద్యార్థుల ఎఫ్‌ఎల్‌ఎన్ సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులందరికీ ఉచిత యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యాయురాలు లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి


వినతిపత్రం అందిస్తున్న ఆలయ కమిటీ నాయకులు

కుభీర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ గుండా ప్రవహించే ప్రధాన మురికి కాలువలపై గత కొన్ని సంవత్సరాలుగా ఆక్రమంగా నిర్మించుకున్న రేకుల షెడ్‌లను వెంటనే తొలగించాలని సోమవారం విఠలేశ్వర ఆలయ కమిటీ నాయకులు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సూదిరాజన్న, డా. శంకర్ అధికారులతో మాట్లాడారు. ప్రధాన మురికి కాలువపై అక్రమంగా షెడ్‌లు వేయడంతో వర్షాకాలం వరద , మురికి నీరు ప్రవహించకపోవడంతో విఠలేశ్వర ఆలయం, ప్రభుత్వ ఆసుపత్రి మేదరివాడలోని ఇండ్లలోకి వరద నీరు చేరి ఇబ్బందిగా మారుతోందన్నారు. విఠలేశ్వర ఆలయంలో మోకాలి వరకు నీరు చేరడంతో భక్తులకు, ఆసుపత్రి వెళ్లే రోగులకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు, ఆర్‌డీవోకు వివరించామన్నారు. వర్షాకాలం ముంపుకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులతో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్డివార్ శ్రీకర్, వెంకటస్వామి, పెంటాజీ, జీవన్, విఠల్, సురేష్, అధికారులు ఎంపీడీవో సాగర్‌రెడ్డి, ఎంపీవో మోహన్‌సింగ్, ఎంఈవో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

తానూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేల్‌తరోడా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. గ్రామంలో 5 ఇళ్లు మంజూరు కాగా నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి రవికాంత్‌రెడ్డి, మధుపటేల్, యువనాయకులలు అటల్ దేవిదాస్, ఎంపీటీసీ పోశెట్టి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు గంగాధర్, సాయిగౌడ్, కాస మహేష్, బి. కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వారి సమస్యల పరిష్కారానికి రైతు నేస్తం కేంద్రాలు కీలకంగా పని చేయనున్నాయని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయవ విశ్వవిద్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నిర్మల్ గ్రామీణ మండలంలోని చింత్యాల రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతుల అవసరాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. పంటలసాగు, పెట్టుబడులపై వచ్చే భారం తగ్గించేందుకు రైతు భరోసా పథకాన్ని నేటి నుంచే అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లకు అనుమతులు మంజూరు చేశామని, గృహ నిర్మాణానికి సిద్ధంగా ఉన్న లబ్ధిదారులకు తక్షణమే అనుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివాదాస్పద భూములపై స్పష్టత ఇవ్వడంలో ఈ సదస్సులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు జిల్లాస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయని, ప్రతి పథకం అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

• జిల్లా అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరం

జిల్లా కలెక్టర్‌గా అభిలాష అభినవ్ ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధికారుల సమక్షంలో కలెక్టర్ కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలన్నారు. ప్రజలకు ప్రభావవంతమైన సేవలందించడమే మన లక్ష్యంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

• యోగా దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పోస్టర్లను కలెక్టర్ అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 21న నిర్మల్ పట్టణంలోని దివ్యగార్డెన్‌లో నిర్వహించే యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. యోగా సాధన శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవనశైలిలో యోగాని భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా అధికారులు, ఆయుష్, వైద్య ఆరోగ్య విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కడ్తాల్ గ్రామ రైతులు

సోన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ మల్లేష్‌రెడ్డి రైతులతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని కడ్తాల్ గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. భూ అవసరాల నిమిత్తం మండల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా తహసీల్దార్ మల్లేష్‌రెడ్డి ప్రవర్తిస్తున్నాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గంటల కొద్దీ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్నామన్నారు. రాజకీయ నాయకులతో వెళ్తే పనులు చేస్తున్నారని ఇదేంటని అడిగితే బెదిరిస్తున్నడని తెలిపారు. ఎక్కువ ఏమి మాట్లాడినా మీ సర్వే నెంబర్‌ను రెడ్ మార్క్ చేస్తా అంటున్నారన్నారు. నిరక్షరాస్యులైన రైతులు కార్యాలయానికి తెలిసిన వారిని తీసుకువెళ్తే బ్రోకర్ పనులు చేస్తున్నారంటూ వారిని తూలనాడుతున్నారన్నారు. ఎవరికి ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోండని నాకు కూడా ఈ మండలంలో ఉద్యోగం చేసేది లేదు అంటూ గర్జించి మాట్లాడు తున్నాడన్నారు. ఇలాంటి అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కడ్తాల్ గ్రామ రైతులు

బాసరలో సరస్వతీ శిశుమందిర్ ప్రారంభం


చిన్నారులకు ఓనమాలు దిద్దిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

బాసర,జూన్16 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ మాత కొలువైఉన్న బాసర క్షేత్రంలో శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల సోమవారం ప్రారంభమైంది. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పాఠశాల విద్యార్థులకు ఓనమాల దిద్ది ప్రారంభోత్సవం చేశారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో బాసరలో సరస్వతీ శిశుమందిర్ పాఠశాల కొనసాగింది. పదేళ్ల క్రితం సరైన భవనం లేక మూసివేశారు. దాదాపు పది సంవత్సరాల తరువాత మళ్లీ పాఠశాలను పునః ప్రారంభించారు. గ్రామ పెద్దలు పట్టుదలతో శిశుమందిర్ కోసం పక్క భవనాన్ని నిర్మిస్తున్నారు. తొలి ఏడాది ప్రారంభ తరగతులు మాత్రమే ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐచర్ వాహనం ఢీ.. ఆటో బోల్తా


బోల్తా పడిన ఆటో.. గాయపడిన వ్యక్తి.. ప్రమాదానికి కారణమైన వాహనం

నిర్మల్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఐచర్ వాహనం ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటో బోల్తా పడిందని రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం భైంసా నుంచి నిర్మల్‌కు వస్తున్న ఆటోచిట్యాల గ్రామశివారులో బ్రిడ్జి దగ్గర నిర్మల్ వైపు నుండి వస్తున్న ఐచర్ ఓవర్టేక్ చేస్తూ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఆటోను ఢీకొట్టగా ఆటో డ్రైవర్ పింగ్లి సారీపుత్ర సహా అందులో ఉన్న అశోక్, దివిటి గర్ గంగుబాయి, దివిటి బాబులకు గాయాలయ్యా యని తెలిపారు. ఆటో డ్రైవర్ అన్న పింగ్లి గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా కేంద్రంలో కురిసిన మోస్తరు వర్షం

నిర్మల్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒక్కసారిగా కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు.

భార్యను హత్య చేసినందుకు ఆరేళ్ల జైలు

నిర్మల్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కట్టుకున్న భార్యను హత్య చేసిన భర్తకి 6 సంవత్సరాల కారాగా శిక్ష రూ. 2,000ల జరిమానా విధించినట్లు జిల్లా న్యాయాధికారి శ్రీవాణి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... పాలకర్ సాయినాథ్ నివాసం బాసర. ఆవేశంలో కట్టుకున్న భార్యను కిరోసిన్ పోసి తగలపెట్టడం జరిగింది. భార్య చనిపోతూ మరణ వాంగ్మూలం ఇవ్వటం జరిగింది. కేసు సాక్ష్యాలను పరిశీలించిన తరువాత సోమవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జి కోర్టు నిర్మల్ జడ్జి శ్రీవాణి నిందితుడికి 6 సంవత్సరాల జైలు శిక్ష, 2,000ల రూపాయల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకోలేరు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపన జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని తెలిపారు. పోలీసు శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటూ, న్యాయస్థానాల ద్వారా శిక్షణలు పడటానికి తగిన సాక్షులను న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టడానికి పోలీసులు కృషి చేస్తారని తెలిపారు. నిందితుడికి శిక్షణ పడడంలో కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే. వినోద్ రావు, విచారణ అధికారి ఎస్సై తోట మహేష్, డ్యూటీ ఆఫీసర్స్ ఏఎస్సై డబ్లు సింగ్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వాగులో దూకి ఒకరి ఆత్మహత్య


సాయినాథ్ మృతదేహం

కుభీర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన వాగ్మారే సాయినాథ్(26) అనే యువకుడు వాగులో దూకి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు సాయినాథ్ కూలిగా పని చేస్తూ జీవనం సాగించేవాడు. కాగా మందుకు బానిసై రోజు తాగి వస్తుండడంతో భార్య మందలించగా మనస్తాపానికి గురయిన సాయినాథ్ మద్యం మత్తులో ఆదివారం అందజా 10గంటల సమయానికి వాగులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక కూతురు ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదావరి పరీవాహక ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తహసీల్దార్ బత్తుల విశ్వంబర్

దస్తురాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉన్నందున లోతట్టు, ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువులు, గోదావరి నది ప్రాంతాల్లో జాలర్లు, పశువుల కాపర్లు వెళ్లవద్దన్నారు.